
మీర్‌పేటలో నల్లబాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేస్తున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తదితరులు

ఆర్కేపురంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శ్యాంసుందర్‌గుప్తా

షాహిన్ నగర్‌లో సీఎం దిష్ట బొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు షర్పుదీన్ తదితరులు

అవమానంపై ఆగ్రహం

నిండు సభలో ఆడబిడ్డలకు అవమానం

సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు గౌరవం లేదా..?

మార్పు అంటే.. మహిళలను అవమానించడమేనా..?

నిరసనలతో భగ్గుమన్న మహేశ్వరం.. నల్ల బ్యాడ్జీలతో నిరసన

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి దిష్టిబొమ్మల దహనం

అర్ధరాత్రి పోలీసుల అరెస్టులు, నిర్బంధాలు

'ఇందిరమ్మ రాజ్యమంటే మహిళలను అగౌరవపరచడమేనా.. ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం.. ఇది యావత్ మహిళా లోకానికి జరిగిన అవమానం.. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి' అని పలువురు మహిళలు, బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు చేసిన అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా గురువారం పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. పలుచోట్ల సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టిబొమ్మలను దహనం చేసి, నల్ల బ్యాడ్జీలతో పెద్ద ఎత్తున నిరసనలు చేశారు.

మర్లబడ్డ మహిళా లోకం..

బడంగ్‌పేట/ఆర్కేపురం, ఆగస్టు 1: మార్పు అంటే మహిళలను అవమానించడమేనా అని డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మహేశ్వరం నియోజకవర్గంలో ఆందోళనలు చేపట్టారు. సీఎం దిష్టి బొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళలను కించపరిచిన రేవంత్ రెడ్డి బేషరత్‌గా సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులను పెట్టి నిరసన చేయకుండా ఆపాలని చూడటం అప్రజాస్వామికం అన్నారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతల పట్ల పోలీసులు దురుసగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు.

బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్ చౌరస్తాలో బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు జలాల్పూర్ సునీతాబాల్‌రాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి దిష్ట బొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్ కుమార్, లలిత జగన్, విజయలక్ష్మి, శ్రీనివాస్ గుప్తా, తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు శివకుమార్, ఏనుగు రాంరెడ్డి, నాయకులు బోయపల్లి శేఖర్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, లిక్క కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మీర్‌పేటలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి ఆధ్వర్యంలో..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని అవమాన పరిచిన సీఎం రేవంత్ రెడ్డి బేషరత్‌గా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, నవీన్ గౌడ్, మాదరి రమేశ్, విజయలక్ష్మి, సునీత, లలితజగన్ తదితరులు ఉన్నారు.

షాహిన్ నగర్ చౌరస్తాలో..

జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహిన్ నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్పుదీన్(హమేద్) ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బాదర్, సయ్యద్ పటేల్, కరీం, మన్సూరలీ, మన్నన్, నాగేశ్, సలీం, సయ్యయద్, ఆరీఫ్, ముగ్దూం, హమీద్ సిద్దిక్, జావేద్, అర్జున్, అబ్బాస్ తదితరులు ఉన్నారు.

ఆర్కేపురంలో..

బీఆర్ఎస్ ఆర్కేపురం డివిజన్ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గుప్తా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పగడాల దీపక్, రహీం, శ్రీనాథ్‌యాదవ్, లోకి, హరీశ్, నరేందర్, గణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అరెస్టులు.. నిర్బంధాలు

తుక్కుగూడ మున్సిపాలిటీలో రాత్రి సమయంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సామేల్ రాజును, ప్రవీణ్, అన్వేశ్‌ను రాత్రి సమయంలో అరెస్టు చేశారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ అయిపోయిన తర్వాత వదిలి పెడుతామని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులపైన కక్షపూరితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు.

ముందస్తు అరెస్టులు

ఎల్బీనగర్ పోలీసులు ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేశ్, సాజీద్, సరూర్‌నగర్ పోలీసులు సరూర్‌నగర్ డివిజన్ నాయకుడు లోకసాని కొండల్‌రెడ్డి, పుట్టం పురుషోత్తంరావు, గౌని శ్రీనివాస్ గౌడ్, సలీం, పోలే అరవింద్, పోలే సుధామ, కట్ట ప్రవీణ్, ప్రత్యూశ్, రాజు యాదవ్, సునీల్‌యాదవ్, కిరణ్, సాయి, నరేశ్‌గౌడ్, చైతన్యపురి పోలీసులు వీర మళ్ళ రామ్‌నర్సింహ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులను ముందస్తు అరెస్టు చేశారు.

ప్రశాంత్ హిల్స్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట మహిళా అధ్యక్షురాలు జలాల్పూర్ సునీతాబాల్‌రాజ్ ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మీర్‌పేటలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తు దృశ్యం. చిత్రంలో కార్పొరేటర్ సిద్దాల బీరప్ప తదితరులు

పోలీసులు అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలు

పెండ్యాల నాగేశ్, సాజీద్‌ను అరెస్టు చేసిన ఎల్బీనగర్ పోలీసులు

లోకసాని కొండల్‌రెడ్డిని అరెస్టు చేసిన సరూర్‌నగర్ పోలీసులు

వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ/ఐడీ) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 12వ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది

మన్సూరాబాద్, ఆగస్టు 1: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినప్పటికీ ప్రజలకు ఒరిగిందేమి లేదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యాచరణపై కార్పొరేటర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును పరిరక్షించాలి

మన్సూరాబాద్, ఆగస్టు 1: కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును పరిరక్షించాలని కోరుతూ గత నెల 26న విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు మేరకు గురువారం విజిలెన్స్ అధికారులు హత్తిగూడ చెరువు హద్దులు, ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలించారు. రెండు సంవత్సరాల క్రితం ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న హత్తిగూడ చెరువు రెండు ఎకరాలు మిగిలిందని విజిలెన్స్ అధికారులకు కార్పొరేటర్ వివరించారు. కబ్జాదారులకు సహకరిస్తున్న ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. హత్తిగూడ చెరువు విషయంపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేసి తగు చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హామీనిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈవీడీఎం విజిలెన్స్ ఏఈ మల్లికార్జున్, ఎస్ఐ మోహన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

4న హయత్‌నగర్‌లో బోనాలు

హయత్‌నగర్, ఆగస్టు 1: ఈనెల 4న హయత్‌నగర్ గ్రామంతోపాటు పరిసర కాలనీల్లో బోనాల పండుగ నిర్వహించేందుకు గ్రామ పెద్దలు పండితుల సమక్షంలో నిర్ణయించారు. ఆయా కాలనీలు, బస్తీల్లోని ఆలయాల వద్ద మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారిని దర్శించుకోవచ్చని వారు తెలిపారు.

మాదిగల పోరాటానికి న్యాయం లభించింది

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 1(నమస్తే తెలంగాణ): సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ముప్పై ఏండ్ల మాదిగల పోరాటానికి న్యాయం లభించిందని రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ కేటగిరిలోని అనేక వర్గాలకు అవకాశం దక్కలేదని, వర్గీకరణతోనే అసమానతలు తొలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాద సంఘం అధ్యక్షుడు పీఠం ప్రదీప్‌కుమార్, ఎస్సీ వర్గీకరణ ఉద్యమ నాయకులు జొన్నాడ రాకేశ్‌కుమార్, మంచర్ల విష్ణువర్ధన్, గ్యార సతీశ్‌తో పాటు న్యాయవాదులు దర్శన్, గురువయ్య గౌడ్, విజయ్ నాయక్, సురిగి మహేశ్‌గౌడ్ బార్ అసోసియేషన్ క్రీడాకార్యదర్శి అశోక్ అందేకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


ఎల్బీనగర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ జోగురాములు, కోటగిరి ఉషారాణి, మల్లెపాక అనిల్, కందుకూరి లక్ష్మయ్య, ఆడాల రమేశ్, గుండె కిరణ్, సంగపాక యేసూప్, విజయ్, రజిని, గుండెపాక శంకర్, ప్రభాకర్, మహేశ్, నాగరాజు, ముత్యాల విష్ణువర్ధన్, మోహన్, లింగస్వామి, నరేశ్, మారెమ్మ, భిక్షపతి – మన్సూరాబాద్, ఆగస్టు 1

జిల్లా కోర్టుల ముందు న్యాయవాదుల సంబురాలు

సుప్రీం ధర్మాసనానికి, రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగలు. – మలక్‌పేట, ఆగస్టు 1

మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్, దళిత సంఘాల నాయకులు ఇమ్మడి నాగయ్య, వెంకటస్వామి, గ్యార సతీశ్, గంట ముత్తయ్య. – మలక్‌పేట, ఆగస్టు 1

రక్తదాన శిబిరంలో భక్తుల ఆసక్తి

సైదాబాద్, ఆగస్టు 1: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలోని షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం ఆలయం ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డన్ హార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు ముందుకు వచ్చి రక్తదానం చేయటానికి ఆసక్తి చూపించారు. దాతలనుంచి సేకరించిన రక్తాన్ని నారాయణగూడ బ్లడ్ బ్యాంక్‌కు అప్పగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డన్ హార్ట్స్ ప్రతినిధి సంయుక్త, షిర్డీసాయి బాబా మందిరం చైర్మన్ సాంబశివశాస్త్రి, షిర్డీసాయి బాబా మందిరం ట్రస్టీ నెరేళ్ల ప్రసాద్, రాజ్యలక్ష్మి, భక్తులు తదితరులు.

హనుమాన్ ఆలయ ఈవోగా ఎన్.లావణ్య

చంపాపేట, ఆగస్టు 1: కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ కార్యనిర్వాహణాధికారిగా ఎన్.లావణ్య బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా బుధవారం వరకు బాధ్యతలు నిర్వర్తించిన ఎం.శ్రీనివాస శర్మను నగరంలోని శ్రీనగర్ కాలనీ(యూసూఫ్‌గూడ)పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా గురువారం ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

పైపులైన్ పనులు పూర్తిచేయాలి

హయత్‌నగర్, ఆగస్టు 1: డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్‌లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పునర్నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం జలమండలి అధికారులతో కలిసి వీధుల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడినప్పుడు రోడ్లన్నీ బురదగా మారి బస్తీవాసులకు, వ్యాపారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వీధుల్లో డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి కాగానే ఎలాంటి ఆలస్యం జరగకుండా సీసీ రోడ్డు మరమ్మతులు జరిపించాలని జలమండలి అధికారి డీజీఎం మాధవికి తెలిపారు. ఆయన వెంట జలమండలి సూపర్‌వైజర్ బాలు, బస్తీవాసులు శ్రీనివాస్, అలీ, ఆగమయ్య తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

హయత్‌నగర్, ఆగస్టు 1: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీదేవి అన్నారు. గురువారం గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా హయత్‌నగర్ బ్రాంచి(సాయినగర్) శ్రీచైతన్య స్కూల్‌లో ఆమె మొక్కలు నాటా మాట్లాడారు. మొక్కలను పెంచి కాపాడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆర్ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మొక్కలతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించగలమన్నారు. తదనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సతీశ్, అకాడమిక్ డీన్ రఘుపతి, సీ బ్యాచ్ ఇన్‌చార్జి సోమయ్య, ఏఓ ప్రమోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాగణపతికి పాదపూజ

నేడు విగ్రహ నమూనా ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఆగస్టు 1: ఖైరతాబాద్‌లో కొలువదీరనున్న మహాగణపతి మట్టి విగ్రహ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు స్టీలు, వైర్లతో విగ్రహ రూపాన్ని తయారు చేశారు. సుమారు 70 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న విగ్రహ పాదాలను తొలుత మట్టితో అంకురార్పణ చేశారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి పాదపూజ నిర్వహించారు. నేడు స్వామి వారి పూర్తి నమూనాను ఆవిష్కరిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్ తెలిపారు.

నిమ్స్‌పై వచ్చే ఫేక్ కథనాలను నమ్మకండి

ఖైరతాబాద్, ఆగస్టు 1: నిమ్స్ దవాఖానపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో ఫేక్ కథనాలు వస్తున్నాయని, వాటిని నమ్మవద్దని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిమ్స్‌లో ఓ రోగి చనిపోయడని, అతని కుటుంబ సభ్యులకు డెత్ సర్టిఫికేట్ ఇచ్చి పంపామని, తదనంతరం ఆ వ్యక్తి లేచి కూర్చున్నాడంటూ ఓ సామాజిక మద్యమం వేదికగా అసత్యపు కథనాలు వచ్చాయని, కొందరు వాటిని అదే మాద్యమాల్లో విస్తరించారని తెలిపారు. నిమ్స్‌లో ఆ కథనంలో వచ్చిన పేరుతో రోగులెవరూ అడ్మిట్ కాలేదని, ఇది పూర్తిగా నిరాధారమైన కథనమని తెలిపారు. ఇలాంటి వాటి వల్ల నిమ్స్ ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. ఇలాంటి కథనాలను వేసే ముందు నిమ్స్ యాజమాన్యాన్ని సంప్రదించాలన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడు అరెస్ట్

మన్సూరాబాద్, ఆగస్టు 1: డ్రగ్స్ విక్రయిస్తున్న కేసులో ఓ యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. రాజస్తాన్, బర్మర్ జిల్లా, సిదసవ హర్నియాన్ గ్రామానికి చెందిన విక్రమ్‌కుమార్ అలియాస్ విక్రమ్ గోయెల్ (28) జీవనోపాధి నిమిత్తం 2021లో మోండా మార్కెట్ సమీపంలోని భవానీ రెస్ట్ రూమ్స్‌లో ఉంటున్నాడు. వృత్తిరీత్య రాపిడో బైక్ నడుపుతుంటాడు. చెడు సహవాసాలు, జల్సాలకు అలవాటు పడ్డాడు. రాపిడో బైక్ నడపగా వచ్చిన డబ్బులతో జల్సాలు తీర్చుకోవడం కష్టంగా మారింది. దీంతో రాజస్తాన్ నుంచి డ్రగ్స్ (హెరాయిన్)ను కొనుగోలు చేసి నగరంలో విక్రయించి డబ్బులు సంపాదించాలని పథకం వేసుకున్నాడు. రాజస్తాన్, బర్మర్ జిల్లా, దోరిమన గ్రామానికి చెందిన దినేశ్ కళ్యాణ్ అలియాస్ దినేశ్‌కుమార్ అలియాస్ రాహుల్‌రాయ్ అలియాస్ దినేశ్ బిష్ణోయ్, అలియాస్ మలని అలియాస్ మనీశ్ అలియాస్ మనీశ్‌కుమార్ వద్ద హెరాయిన్ కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చి ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. విక్రమ్ గోయెల్ డ్రగ్స్ విక్రయాలపై పోలీసులకు సమాచారం వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘాపెట్టిన ఎల్బీనగర్ పోలీసులు.. ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో విక్రమ్ గోయెల్ డ్రగ్స్ విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా డ్రగ్స్ విక్రయాల విషయం బయటపడింది. నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి 32.55 గ్రాముల హెరాయిన్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రాజస్తాన్‌లో గ్రాము హెరాయిన్‌ను రూ. 5 వేలకు కొనుగోలు చేసి నగరంలో రూ. 12 వేలకు గ్రాము చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. విక్రమ్ గోయెల్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన దినేశ్ కళ్యాణ్ పరారీలో ఉన్నాడు.